# 2000 A.D. తరవాత వస్తోన్న మార్పులు



Mission
SSS-Hyd

డా॥ ఎమ్. శ్రీరామకృష్ణ M.Sc., Ph.D.

# 2000 A.D. తరవాత వస్తోన్న మార్పులు

22.1.04 సాయంత్రం

శ్రీ దుర్గా గాయత్రీ శక్తిపీఠం, భీమునిపట్నంలో

మాస్టరుగారు ఇచ్చిన ఉపన్యాసం నుండి

ఓం............ ఓం............ ఓం............

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః

అఖండమండలాకారం వ్యాప్తంయేన చరాచరమ్
యత్పదం దర్శితంయేన తస్మై శ్రీగురవే నమః

2000 ఎ.డి. తరవాత వస్తోన్న మార్పుల్ని మీరు గమనించండి. 2000 తరవాతే టి.వి సీరియల్స్‌లో కూడా భాగవతం వస్తోంది. గాయత్రి గురించి వస్తోంది. ఆ మార్పు మీరు గమనించాలి. ఇన్నాళ్ళు లేనివి ఇప్పుడు ఎందుకు వచ్చేస్తున్నాయి? మనం గమనించుకోం.

మనకి టీవీని, కంప్యూటర్‌ని ఉపయోగించుకోవటం రాదు. ముఖ్యంగా పిల్లలకి ఆ కార్యక్రమాల్ని ఉపయోగించుకోవటం నేర్పితే వాళ్ళ జీవితాలలో ఎన్ని మార్పులు వస్తాయో మీకు తెలీదు.

- పిచ్చిగా ఏదో పనికిరాని చదువులు చదివిస్తూ, మన పిల్లల్ని సర్వనాశనం చేస్తున్నాం. ముఖ్యంగా ఈ ఇంగ్లీష్ చదువులు. ఇంగ్లీష్ మీద వెగటుతో నేను చెప్పటంలేదు. పిల్లలకి ఆ చదువులు అక్కర్లేదు.

"మావాడు ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్నాడండీ!" ఎంత గొప్పగా చెప్తారో!

ఛానిసత్వం!

నీ మాతృభాష రాకుండా ఇంగ్లీష్ మీడియంలో చదివితే ఏంటిట?

మా పెదనాన్న వాళ్ళింటికి వెళితే, ఈ మధ్యే ఐదారు నెలల క్రిందట జరిగింది. మా వదిన "టైమ్ ఎంతయింది?" అని అడిగింది. "అయిదున్నర" అన్నాను.

అక్కడే బి.కామ్ చదువుతున్న వాళ్ళ అబ్బాయి కూడా ఉన్నాడు. వాడు అడిగాడు,

"అయిదున్నర అంటే ఎంత బాబాయ్?"

నేను నవ్వుతూ అన్నాడనుకున్నాను. నిజంగానే రాదు వాడికి. అప్పుడు నేను కూర్చోబెట్టి నేర్పాను.

- మీరేం చేస్తున్నారో అర్థమవుతోందా? మాతృభాష రాదు, ఇంగ్లీష్ వచ్చినా వాడి మాతృభాష అవదు.
- అంచేత జ్ఞానము నేర్చుకునేటటువంటి భాష ఆదిలోనే కుంటుపడింది. భారతీయులకి సబ్జక్ట్ రాకపోవటానికి కారణం భాష రాకపోవటం.

ఇంగ్లీష్ మీడియమో, ఇంగ్లీష్ మీడియమో అని ఎందుకు మీరు వెంపర్లాడిపోతున్నారు?

"కాదండీ, మేం ఇంగ్లీష్ మీడియమే చదివిస్తాం".

శ్రీ మా వాళ్ళకి చాలా స్పష్టంగా చెప్తున్నాను,
"చదివించకండి!"

ఇంగ్లీష్ నేర్చుకో. అది వేరే విషయం.

**ఎందుకంటే,**

మనం ఇరుక్కుపోయాం.

- లార్డ్ మెకాలే చాలా స్పష్టంగా ఉత్తరం వ్రాశాడు,
"భారతజాతిని నిర్వీర్యం చేసేశాను!
సర్వనాశనం చేసేశాను!
చచ్చినా అది తల పైకెత్తలేదు.
ఎంచేతంటే, ఇంగ్లీష్ నేర్చుకో అని వాళ్ళకి నేర్పిం చేశాను. ఇంక వాళ్ళు పీక్కుని చావటమే!"

- ఇప్పటికీ ఎడ్యుకేషన్ సిస్టమ్ మార్చలేని దద్దమ్మలుగా ఉన్నాం మనం. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళు అయ్యాక, మన భారతజాతి యొక్క ఎడ్యుకేషన్ సిస్టమ్‌లో భారతీయత గురించి మాట్లాడేటటువంటి దమ్ము లేదు మనకి.

జోహార్లు! వాళ్ళు ఎంత గ్రాండ్‌గా ఆలోచించ గలిగే వాళ్ళో చూడండి. "మనం రాజ్యం చేయటంలేదు అనుకుంటున్నావా? మనమే రాజ్యం చేస్తున్నాం, మన ఇంగ్లీషే రాజ్యం చేస్తోంది" అని వ్రాశాడా లెటర్‌లో.

ఇంగ్లీష్ వచ్చినవాడు ఈనాడు కూడా చాలా గొప్ప వాడు. భారతదేశంలో ఇంగ్లీష్ వచ్చినవాడు గొప్పవాడు అవటం ఏమిటి? ఇన్ వాట్ వే హీ ఈజ్ ఇంపార్టెంట్?

ఇంగ్లాండ్ ఎంత చిన్న రాష్ట్రమో మీకు తెలుసు కదా! అంత చిన్న దేశపు వ్యక్తులు రవి అస్తమించని సామ్రాజ్యాన్ని ఎలా డెవలప్ చేసుకోగలిగారు?

**ఎందుకు ఇదంతా చెప్తున్నాను అంటే,**

ఈశ్వరేచ్ఛ అంటే ఏమిటో మీకు అర్థమవ్వాలి. ఈశ్వరేచ్ఛ ఉన్నప్పుడు ఎవడైనా గొప్పవాడైపోతాడు.

ఆ ఈశ్వరేచ్ఛకు అనుగుణ్యంగా మీ జీవితాలను మీరు మార్చేసుకుంటే ఇప్పుడు ఆ మెకాలే గురించి ఎలా చెప్పుకుంటున్నామో, రేపు మన గురించి "ఇలా వాళ్ళు రివల్యూషన్ తీసుకొచ్చారు" అని గర్వంగా చెప్పుకుంటారు. మీరు ఆ రివల్యూషన్ గురించి ఆలోచించండి. మీరు ఆ విప్లవం తీసుకురావాలి.

**విప్లవం అంటే ఏమిటో చెప్పాను కదా మీకు,**

విప్లవం చేసే వ్యక్తి కనిపిస్తే భయపడతారు అందరూ. భగత్‌సింగ్‌ని ఒకరోజు ముందే ఉరి తీసేశారు. ఎందుకంటే, ఆ ఒకరోజు ఆగి ఉంటే అసలు వాళ్ళు ఉరి తీయలేకపోయివుండేవారు. ట్రైన్‌లు, ఎడ్లబండిలు, అవన్నీ పట్టుకుని అందరూ ఛలో! అప్పుడు లాహోర్ జైల్లో అనుకుంట ఉన్నాడు. అది చూసి బ్రిటిషర్స్ గాభరా పడిపోయి ముందే ఉరి తీసేశారు. బ్రిటిషర్స్ తప్పు చేశారని నేను అనటంలేదు. వాళ్ళ రాజ్యం కాపాడుకోవటానికి వాళ్ళు చేసింది కచ్చితంగా కరెక్టే.

**కానీ మనమేం చేయగలిగాం అప్పుడు?**

ఒకరోజు ముందే వెళ్ళిపోయివుంటే? పాయింట్ అర్థమవుతోంది కదా, ఈశ్వరేచ్ఛ మనం పట్టుకోవాలి.

- ఆ ఈశ్వరేచ్ఛ పట్టుకోవటానికి ఏకైక మార్గము ధ్యానము. ఇంకొక మార్గం లేదు.

**ఏమిటి మనం ధ్యానంలో పట్టుకోవలసింది అంటే,**

ఇది ట్రాన్సిషన్ పీరియడ్ కనుక, వాతావరణం మారుతోంది కనుక, కొన్ని పనులు మనం చేయవలసి వస్తోంది.

**ఆ కొన్ని పనులలో చాలా విశుద్ధమైన మార్పు ఏమిటంటే, గాయత్రీ అందరూ చేసుకోవచ్చు.**

అదొక పెద్ద మార్పు. అదొక పెద్ద రివల్యూషన్ అది. ఆ రివల్యూషను మనకి అర్థం అవటంలేదు. ఎంచేతంటే, మనం చేసేసుకుంటున్నాం కనుక.

స్త్రీలకి సమానమైన ఎడ్యుకేషన్ అర్హతలు ఉన్నాయి. అంచేత స్త్రీలు చదవవచ్చు అనేది ఇప్పుడు అందరూ చేసేస్తున్నారు కనుక అందరూ చదువుకోవచ్చు అనుకుంటున్నారు కాని, ఒక 40 ఏళ్ళ క్రిందట స్త్రీలు చదువుకోవటానికి వెళ్ళినప్పుడు ఎలాంటి పరిస్థితి ఉండేదో మీరు ఊహించుకోవచ్చు.

గురుదేవులు చెప్పినటువంటి చాలా మార్పులు ఈ 2000 ఎ.డి. తరవాత మన జీవితాలలో మనం చాలా స్పష్టంగా చూడబోతున్నాం.

➪ 1985 లో ఈశ్వరేచ్ఛ గురించి చెప్తూ, నేను చేసే ఈ పంచకోశ సాధన వల్ల ఆయుర్వేదం చాలా ప్రముఖపాత్ర వహించబోతోంది అని చెప్పారు.

అదేంటో తమాషా, ఈనాడు టీవీ చూస్తే హెర్బల్ అనేమాట లేకుండా ఒక్క ఎడ్వర్టయిజ్‌మెంట్

కనిపించదు. అన్నిటికీ హెర్బలే. 1985 లో ఆయన అన్న మాటలు అవి. వచ్చిందా, లేదా?

కానీ మనం మాత్రం ఆయుర్వేదం నేర్చుకోవటంలేదు. గాయత్రీ మంత్రంలో ఆయుర్వేదం యొక్క మొత్తం సూత్రాలు ఉన్నాయి. మరి గాయత్రీ మంత్రాన్ని ఆ దృష్టి కోణంతో ఎక్కడ చదువుతున్నాం మనం? ఆ దృష్టి కోణంతో మనం జపం చేద్దాం.

ఇప్పుడు కేవలము వాతావరణంలో ఉన్న వేడిని పట్టుకుని అనేక చోట్ల ఆయుర్వేద మందులు ఇవ్వటం, ఆయుర్వేదం గురించి ప్రచారం వస్తోందికాని, వాళ్ళు ఆ సబ్జెక్ట్‌ని డీప్‌గా చదవటంలేదు. డీప్‌గా వెళ్ళాలి. అది మామూలు విషయం కాదు. చాలా లోతుగా వెళ్ళాలి. కానీ చెయ్యని వాళ్ళకంటే ఇది ఓ.కె.

కానీ ఆయన శిష్యులు ఏం చెయ్యాలి అని?

✧ ఆయుర్వేదాన్ని ఒక అద్భుతమైనటువంటి సాధనా విధానంగా మీరు మార్చుకోవచ్చు. అది ఈశ్వరేచ్ఛ. ఈశ్వరేచ్ఛ తెలుసుకొని ముందే మీరు ఆయుర్వేదిక్ లైన్‌లో పడిపోయి చేయటం మొదలెడితే వైద్య విధానంలో అనేక మేజిక్‌లు జరుగుతాయి.

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్

నాలుగు విధాలైన అన్నాన్ని నేను వైశ్వానరుడుగా వుండి, ప్రాణాపానసమాయుక్తః - ప్రాణము, అపానము, సమానము, ఈ 3 వాయువుల్ని కలిపి, (ఆయుర్వేదంలో వాత, పిత్త, కఫాలు) నేను మనుష్యులకి ఆరోగ్యం కలుగ చేస్తున్నాను అని చెప్తాడు.

ప్రాణాయామంలో మనం అది నేర్చుకుంటాం. లోమ విలోమ ప్రాణాయామము ప్రాణాపాన సమాయుక్తః అవుతుంది. దీర్ఘ ప్రాణాయామము ప్రాణము, అపానములను కలుపుతుంది.

కానీ ఈ కలపటం అనేది మీరు చేసుకుని మీ జీవితాలలో మార్పు తీసుకువస్తే, "లావయిపోతున్నాం, హెర్బల్ ట్రీట్‌మెంట్స్ ఇచ్చుకుంటున్నాం మాష్టారు!" అనక్కరలేదు. మీరు గ్యారంటీగా సన్నబడతారు.

నన్ను చూసిన వాళ్ళకు తెలుస్తుంది, 3 ఏళ్ళ క్రిందట ఎలా ఉండేవాడినో, ఇప్పుడు ఎలా ఉన్నానో. అప్పుడు నా బరువు 89 కేజీలు. నడిస్తే? నాకు ఇప్పుడే ఆయాసం వస్తోంది తలుచుకుని. మరి ఇప్పుడేం లేవు.

నడుం సన్నబడిపోతుంది, లావు తగ్గుతుంది.

"కాదండీ మేము మందులు వేసుకుని లావు తగ్గించుకుంటాం!"

తగ్గదు. అసంభవం అది. ఇంపాజిబుల్ అది. యాజ్ ఏ బయోకెమిస్ట్ చెప్తున్నాను. మీరు ఉత్తినే డబ్బు ఖర్చు పెట్టుకుంటే పెట్టుకోండి తప్ప, తాత్కాలికంగా లావు తగ్గవచ్చు కాని, పర్మినెంట్‌గా లావు తగ్గదు.

**ఇది ఎందుకు చెప్తున్నాను?**

ఈ క్లాస్‌లో మనం ఏదో భగవంతుడు గురించి, నువ్వు చనిపోయాక ముక్తి పొందుతావు అనే దాని గురించి మాట్లాడటం లేదు. ఈ జీవితంలో, ఈనాడు, ఈ క్షణంలో నువ్వు ఆరోగ్యంగా ఎలా ఉండగలవు? దాని గురించి మనం మాట్లాడుకుంటున్నాం.

- మనకి పనికొచ్చేటటువంటి మాటలు మాట్లాడుకుంటున్నాం మనం. అది ఈశ్వరేచ్ఛ.

ఇది కొన్నాళ్ళ క్రిందటే రావచ్చు కదా! మరి రాలేదుగా. ఇప్పుడు కదా మాట్లాడుకుంటున్నాం మనం.

ఈ ఈశ్వరేచ్ఛకు అనుగుణ్యంగా ఎవరైతే ఉంటారో, వాళ్ళకి రోగాలు ఉండవు.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః

* రోగాలు పాపాలు వల్ల వస్తాయి అని ఆయుర్వేదం చెప్తోంది. అన్ని రోగాలు. భౌతికమైన రోగాలు, మానసికమైన రోగాలు. ఆది, వ్యాధి.

మానసికంగా ఉంటే "ఆది" అని, దాని ప్రభావం శారీరకంగా కనిపించటం మొదలుపెడితే "వ్యాధి" అని అంటాం. ఈ రెండూ ప్రాణాయామం వల్ల పోతాయి.

* ప్రాణాయామం వల్ల ఆది, వ్యాధులు పోతాయి, లావు తగ్గుతారు, మస్తిష్కంలో మెమరీ పవర్ పెరుగుతుంది అంటే, మేము చేయలేకపోతున్నాం అంటే, మన ప్రారబ్ధ కర్మ, మనం ఇది వరకు జన్మలలో చేసిన పాపం మన నెత్తిమీదకెక్కి ఎలా కొడుతోందో మీరు ఊహించుకోండి.

సింపుల్ టెక్నిక్,

గాయత్రీ మంత్రం చేసుకో నాయనా,
సూర్యుడు యొక్క శక్తి సంపాదించుకో!
గాలి పీల్చుకుని వదులు,
నువ్వు రోగ రహితుడివి అయిపోతావు!

కానీ ఏదో ఒక రోజు, రెండు రోజులలో మాత్రం ఇవి జరగవు. కానీ వచ్చిన మార్పు చాలా స్పష్టంగా పర్మినెంట్‌గా ఉండిపోతుంది.

**ఇదంతా ఎందుకు జరుగుతోంది అంటే,**

ఈశ్వరేచ్ఛ కనుక. మీరు అది గుర్తుంచుకోండి. ఈనాడు ఇవంతా ఎందుకు చేయమంటున్నాం అంటే, ఈశ్వరేచ్ఛ కనుక.

వెంకటేశ్వరస్వామి చరిత్ర మీరు కాస్త స్పష్టంగా చదివితే తెలుస్తుంది, ఇంగ్లీషు వాళ్ళకి భలే హెల్ప్ చేశాడు. వాళ్ళను మన నెత్తి మీదకి ఎక్కించిందే వెంకటేశ్వర స్వామి. ఎందుకంటే, అది ఈశ్వరేచ్ఛ కనుక. అందుకు చెప్తున్నాను. అలా జరగటమే ఈశ్వరేచ్ఛ. ఇప్పుడు జరిగే మార్పులు కూడా ఈశ్వరేచ్ఛ.

- అప్పుడు వాళ్ళకి సహాయ పడ్డవాళ్ళు లబ్ధి పొందారు. ఎంచేత? ఈశ్వరేచ్ఛ కనుక.

  ఇప్పుడు దీనికి సహాయ పడ్డవాళ్ళు లబ్ధి పొందుతారు. ఎందుకంటే, ఇది ఈశ్వరేచ్ఛ కనుక.

శ్రీ నిత్యజీవితంలో మన పిల్లల్ని మెల్లిగా ఈ మార్గంలో పడేసేటటువంటి ప్రయత్నాలు చేయండి.

మొట్టమొదటిది,

గాయత్రీ జపం చేస్తే కాని భోజనం చేయొద్దు అని ఒక చిన్న అలవాటు చేయించండి.

మంచిది అని తెలిశాక మీ పిల్లల చేత ఎందుకు చేయించలేరు మీరు? వాడు స్కూలుకి వెళ్ళను మొర్రో అంటే ఏడిపించి పంపిస్తున్నారు కదా! మరి ఏడిపించి గాయత్రీ మంత్రం ఎందుకు చేయించలేరు? ఇది ఎంత ముఖ్యమైనదో ఆ మహానుభావుడు చెప్తున్నాడుకదా!

♣ చెప్తోన్న వ్యక్తికి కూడా మీరు విలువ ఇవ్వాలి.

ఎవడో చెప్పటం వేరు, అసలు ఆ అవతారమే ఈ విషయాలు మీకు చెప్పటానికి వచ్చింది అనేటటు వంటి వ్యక్తి చెప్తూవుంటే, ఇంకేముంది మీరు కళ్ళు మూసుకుని రంగంలో ప్రవేశించటమే!

స్వస్తి

